వేర్వేరుగా కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: కురుమ, యాదవ్‌లకు వేర్వేరుగా రెండు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం కురుమ సంఘం నాయకులు చౌదరిపల్లి పర్వతాలు బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి సమన్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. పాండు కురుమ, శ్రీనివాస్, హనుమంత్, మహేందర్, శ్రీశైలం, చంద్రశేఖర్, వెన్నెల తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



అల్వాల్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో మహిళలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌కు చెందిన లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

రామంతాపూర్ : ఎలక్షన్ కోడ్ వచ్చిన కారణంగా గతంలోనే మంజూరైన అభివృద్ధి పనులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ముకుందరెడ్డికి కార్పొరేటర్ శ్రీవాణి శనివారం వినతిపత్రం అందజేశారు. దీనిపై జోనల్ కమిషన్ స్పందిస్తూ.. నిబంధనల ప్రకారం పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్‌ఎస్‌కు బోనగిరి సురేష్ రాజీనామా



గౌతంనగర్: శ్రీశైలం దేవస్థానం బోర్డు మాజీ సభ్యులు, బీఆర్‌ఎస్ నేత బోనగిరి సురేష్ యాదవ్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో ఉండి ఎన్నో సేవలు అందజేశానన్నారు. తన అభిమానులు, శ్రేయోభిలాషులు, అనుచరులు, కార్యకర్తలతో చర్చించి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. త్వరలో తమ కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడిగా రాజేష్

ఉప్పల్: కాంగ్రెస్ పార్టీ చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడిగా ములకపల్లి రాజేష్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ పెద్దలకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సాక్షి, సిటీబ్యూరో: గౌతమ్ మోడల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం



సిబ్బందితో రాచకొండ సీపీ తరుణ్ జోషి

మల్లాపూర్: మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషీ అన్నారు. శనివారం నాచారం పోలీస్‌స్టేషన్‌ను సీపీ ఆకస్మికంగా సందర్శించి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ కమిటీ అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. డీసీపీ పద్మజారెడ్డి, మల్కాజిగిరి ఏసీపీతో పాటు అధికారులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ ఎంపీఓగా రవినాయక్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల పరిషత్ ఎంపీఓగా రవినాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ గీతారెడ్డి ఆయన ఉద్యోగ బాధ్యత అప్పగించారు. ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన నందకిశోర్ కీసర మండలానికి బదిలీ కాగా మూడుచింతపల్లి మండల ఎంపీఓ రవినాయక్ బదిలీపై వచ్చారు. అనంతరం మండల కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులకు ఐటీఎం విద్యార్థులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఐటీఎం డిగ్రీ కళాశాలలో మేడ్చల్ జిల్లా టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో బీఎస్సీ, బీకాం విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్స్ కోర్సులు అందించేందుకు శనివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని ఐటీఎం కళాశాలలో డిగ్రీ చదువుతున్న ప్రణయ్‌యాదవ్, లావణ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్.రవీందర్‌రెడ్డి, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అకాడమీ గ్రూపు ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు.

ముదురుతున్న విభేదాలు



ఈసీనగర్ థీమ్ పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ప్రారంభించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ఈసీనగర్‌లో నెలకొల్పిన థీమ్ పార్కును శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించి వెళ్లిన గంటల వ్యవధిలోనే స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి థీమ్ పార్కును ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పార్టీలు వేరు కావడంతో గతంలో వారి మధ్య ఉన్న విభేదాలు మళ్లీ తెరపైకి వచ్చాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత శుక్రవారం చర్లపల్లి డివిజన్, వీఎన్‌రెడ్డినగర్ కాలనీలో సీవరేజ్ పనులను ఎమ్మెల్యే బండారి ప్రారంభించగా.. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరు కాలేదు. ఓ వైపు ఎమ్మెల్యే పార్కును పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేయగా.. మరోవైపు కార్పొరేటర్ ఏకంగా పార్కును ప్రారంభించింది.

గతంలో ఇదే తరహాలో..

గతంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఉన్న సమయంలోనూ.. బొంతు, బేతి మధ్య ఉప్పల్ టికెట్ విషయంలో తలెత్తిన విభేదాలు ఇదే తరహాలో కొనసాగుతూ వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బండారి, బొంతు మధ్య కూడా ఉప్పల్ ఎమ్మెల్యే టికెట్ అంశంలో విభేదాలు ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు కలిసి పనిచేశారు. ఇటీవల బొంతు దంపతులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో విభేదాలు తిరిగి తెరపైకి వచ్చాయి.

ఎన్నికల కోడ్ తర్వాత తిరిగి ప్రారంభిస్తాం

సీవరేజ్ పనుల ప్రారంభోత్సవానికి సంబంధించి అధికారుల ఆహ్వానం మేరకు వెళ్లి ప్రారంభించాను. కార్పొరేటర్ గైర్హాజరుపై నాకు సమాచారం లేదు. ఇక ఈసీనగర్ థీమ్ పార్కులో పనులు ఇంకా పూర్తి కాలేదు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించాను. ఎన్నికల కోడ్ అనంతరం అధికారికంగా తిరిగి ప్రారంభిస్తాం. – బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే

వారు చూపిన దారిలోనే వెళ్తున్నా..

తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే నా డివిజన్‌లో పర్యటిస్తూ.. అభివృద్ధి పనులను ఎలా ప్రారంభిస్తారు. వీఎన్‌రెడ్డినగర్‌లో సీవరేజ్ పనుల ప్రారంభోత్సవంపై అధికారులు సమాచారమిచ్చారు. అందుబాటులో లేకున్నా.. వాటర్‌వర్క్స్ అధికారులను ఒత్తిడి చేసి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. సమాచారం ఇవ్వకుండా పార్కును పరిశీలించడంతో ఆయన చూపిన దారిలోనే తాను వెళ్తున్నాను. – బొంతు శ్రీదేవి, కార్పొరేటర్

ఉప్పల్ శ్మశానవాటికలకు మహర్దశ



కుల సంఘాల పెద్దలకు మంజూరు పత్రాలను అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని కురుమ, రెడ్డి, ముస్లిం శ్మశానవాటికలకు మహర్దశ రానుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మూడు శ్మశానవాటికల అభివృద్ధికి రూ. 55 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం నిధులకు సంబంధించిన మంజూరు పత్రాన్ని ఆయా కులసంఘాల పెద్దలకు శనివారం ఆయన అందజేశారు. గత కొన్నేళ్లుగా ఉప్పల్‌లోని శ్మశానవాటికల్లో కనీస వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని స్థానిక కుల సంఘాల పెద్దలు తమ దృష్టికి తీసుకురావడంతో ముఖ్యమంత్రి ద్వారా నిధులను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : రజక సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కాలంలోనే అన్యాయాలు చేస్తున్న పెత్తందారులను ఎదిరించి ధైర్య సాహసాలు ప్రదర్శించిన చాకలి ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దోబీఘాట్ వద్ద కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి లింగమయ్య, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావుతో పాటు సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ నిందితుల జాడెక్కడ ?



షేక్ సైదులు (ఫైల్)

ఉప్పల్ : ఎస్‌బీఐ శాఖలను కుదిపేసిన ప్రధాన నిందితుల ఆచూకీ నేటికి లభించలేదు. ఉప్పల్, వెస్ట్ మారెడుపల్లి, కోదాడ ఎస్‌బీఐ శాఖల్లో బాధితులు రోజురోజుకు పేరుకుపోతున్నారు. నిందితులు షేక్ సైదులు, గంగ మల్లయ్యల ఆచూకీ తెలుసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితుల కోసం పోలీసులు గత పదిరోజులుగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించడం లేదు. బ్యాంకింగ్ వ్యవస్థను అతలా కుతలం చేసిన ఈ ఘటన జరిగి నెలలు గడిచినా కేసులో పురోగతి లేకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన నిందితులైన షేక్ సైదులు, భగీరథ గంగా మల్లయ్యల ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. ఏకంగా మూడు ఎస్‌బీఐ శాఖల్లో కలిపి దాదాపుగా రూ. 20 కోట్లకు పైగా కొల్లగొట్టి బ్యాంకింగ్ రంగానికి మచ్చ తెచ్చిన కేటుగాళ్లు పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్నారు. నిందితుల ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు రంగంలోకి దింపినట్లు ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు. నిందితుల్లో ఉన్న కొందరినీ అదుపులోకి తీసుకున్నామని, ప్రధాన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై నిరసనలు



మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నాలో పాల్గొన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి



రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రధాన రహదారిపై..

మల్లాపూర్: ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ.. శనివారం మల్లాపూర్ శివహోటల్ వద్ద కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజాస్వామ్య వాదులంతా ఈ చర్యలను వ్యతిరేకించాలన్నారు. బీఆర్‌ఎస్ నేతలు కుంటి కృష్ణ, వాసుగౌడ్, నెమలి రవి, భూసాని రఘు, శ్రావణ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, మారుతీరావు, జీ.కే రమేష్ తదితరులున్నారు.

నాచారంలో..

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు కవిత అరెస్టును నిరసిస్తూ.. శనివారం నాచారం వైజయంతి టాకీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, కొరపాక అంజి, మేడల మల్లికార్జున్‌గౌడ్, రమణారెడ్డి, అశ్వథామరెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌యాదవ్, మారయ్య, ప్రీతిరెడ్డి, శివకుమార్, విజయ్‌కుమార్, బుచ్చన్నగౌడ్, శ్రీనివాస్, రాజశేఖర్, బాలరాజ్, అశోక్, యాదగిరి, సంజన్న, రమేష్, భాగ్య, చంద్రశేఖర్ తదితరులున్నారు.

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రధాన రహదారిపై ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా మాజీ కార్పొరేటర్ గంధం జోష్న్యు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మల్కాజిగిరి: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మల్కాజిగిరి చౌరస్తాలో శనివారం ధర్నా నిర్వహించారు. కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితాకిషోర్, మీనారెడ్డి, సునీతాయాదవ్, మురుగేష్, నాయకులు జగదీష్‌గౌడ్, వెంకన్న, పరశురామిరెడ్డి, అంజయ్య, ఉపేందర్, చిన్నా యాదవ్, డోలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: ఎమ్మెల్సీ కవిత అరెస్టు అప్రజాస్వామికమని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ.. శనివారం హెచ్‌బీకాలనీలో నిరసన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నవీన్‌గౌడ్, పూస రమేష్, శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

మేడిపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అక్రమ అరెస్టును నిరసిస్తూ.. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌బీకాలనీలో కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్‌ఎస్ శ్రేణులు



పీర్జాదిగూడ, వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో..

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జస్టిస్ బీ.ఆర్ మధుసూదన్‌రావు తదితరులు

కుషాయిగూడ: లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం అందుతుందని మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ బీ.ఆర్ మధుసూదన్‌రావు అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ శనివారం కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లాకోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. క్రిమినల్, మోటారు ప్రమాదాలు, గృహహింస, చెక్‌బౌన్స్, ప్రీ లిటిగేషన్లకు సంబంధించిన 1922 కేసులకు పరిష్కరించారు. 21 బెంచీల్లో పరిష్కరించిన కేసుల్లో 22 సివిల్ కేసులు, 54 ప్రీ లిటిగేషన్ కేసులున్నట్లు కోర్టు వర్గాలు ప్రకటించాయి. రూ.71,97,525ల పరిహారం కింద చెల్లించినట్లు పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి రఘునాథ్‌రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, డీసీపీ పద్మజారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



బోడుప్పల్: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. జేజీఆర్ ఉన్నత పాఠశాల పదోతరగతి వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు రాసేటప్పుడు ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా ఆలోచించి పరీక్షలు రాయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



నవీన్‌ను పరామర్శించిన ఈటల రాజేందర్

మల్కాజిగిరి: ప్రధాని మోదీ రోడ్‌షోలో గాయపడిన బాలుడిని బీజేపీ నేత ఈటల రాజేందర్ మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌తో కలిసి పరామర్శించారు. గీతానగర్‌కు చెందిన నవీన్ ఐదో తరగతి చదువుతున్నాడు. కాగా రోడ్ షో సందర్భంగా వారు ఉంటున్న బిల్డింగ్ మీద ఎక్కి జెండా ఊపుతున్నప్పుడు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు జెండా ఉన్న రాడ్ తగిలి గాయాలయ్యాయి. సదరు బాలుడు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. సాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం.



సీసీరోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

అభివృద్ధి పనుల పరిశీలన

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ శివపురికాలనీ, ఆర్‌కేనగర్‌లో రూ.25 లక్షలతో ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి పైపులైన్లు, యూజీడీ పనులు పూర్తయిన కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతున్నట్లు వివరించారు. లక్ష్మి, కృష్ణ, ఉపేందర్, శ్యామ్, రవి, సుబ్బారావు, చైతన్య, శ్రీకాంత్, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

'జో రూమ్స్' యాప్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వ్యవస్థాపకుడు గడ్డం మనోహర్

కుషాయిగూడ: విద్యార్థులు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చేవారు బ్యాచిలర్స్‌గా ఉంటూ చదువుకునే వారికి, ఉద్యోగాలు చేసుకునే వారికి అతిచౌకగా భోజనం, ఆతిథ్యం కల్పించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన జో రూమ్స్ యాప్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించినట్లు యాప్ వ్యవస్థాపకుడు మనోహర్ తెలిపారు. ఈ మేరకు యాప్ వివరాలను గడ్డం మనోహర్ శనివారం వెల్లడించారు. ఈ యాప్‌తో కేవలం రూ.249లతో వసతితో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మెట్రో నగరాలైన హైదరాబాద్, బెంగళూరు వంటి పట్టణాలతో పాటు పర్యాటక ప్రాంతాల్లో కూడా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా వంద నగరాల్లో జో రూమ్స్ యాప్ సేవలను విస్తరించేందుకు కార్యచరణ చేస్తున్నట్లు తెలిపారు. ఆతిథ్యం రంగంలో ఈ యాప్‌తో దేశంలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

పవర్‌బోర్లకు మరమ్మతులు చేయాలి



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూనగర్‌లో పాడైపోయిన రెండు పవన్‌బోర్లకు మరమ్మతులు చేయాలని కోరుతూ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేతలు నాగరాజు శనివారం జలమండలి జీఎం సునీల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో గేట్‌వాల్స్, యూనియన్స్, డబుల్ గల్లీస్, త్రీ వేస్ కేబుల్స్ బోర్‌వెల్ మోటార్ కొత్తవాటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



అల్వాల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న వాగ్మికరావు ఫౌండేషన్ సభ్యులు

అల్వాల్: వాగ్మికరావు ఫౌండేషన్, వీవీఆర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో శనివారం అల్వాల్‌లోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీవీఆర్ గ్రూప్ చైర్మన్ వెన్నమనేని విష్ణురావు మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, మంచి జీపీఏ సాధించిన వారికి రూ.10 వేలు నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీవీఆర్ గ్రూప్స్ డైరెక్టర్ ప్రమీలారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జి అనిష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.